

నేటి నుంచి కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమం

పార్వతీపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమం, సర్వే ప్రారంభమవుతుందని జిల్లా కుష్ఠు వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 2 వరకు జరగనుందని చెప్పారు. వైద్యాధికారి, ఆశ కార్యకర్త, ఒక వలంటీర్ ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేస్తారని, కుష్ఠు లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందిస్తారని తెలిపారు. శరీరంపై స్పర్శలేని, రాగి రంగు మచ్చలు, నరాలు, కాళ్ల, చేతుల కండరాల్లో బలహీనత, తిమ్మిర్లు తదితర లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

ఇంకా ఎన్నాళ్లు?

- కీలక శాఖలకు అధికారులు లేరు
- ఏళ్లుగా భర్తీకాని పోస్టులు
- ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్న వైనం
- అభివృద్ధి పనులపై ప్రభావం



పార్వతీపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పలు శాఖలకు పూర్తిస్థాయి అధికారులు లేరు. ఇన్‌చార్జిలతోనే పాలనను నెట్టుకొస్తున్నారు. ఈ పాలన ఎన్నాళ్లు కొనసాగుతుందో? ఎప్పుడు పూర్తిస్థాయి అధికారులను నియమిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. కీలక పోస్టులను భర్తీ చేయడంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివిధ శాఖలకు పూర్తిస్థాయిలో అధికారులు నియమించింది. కానీ, ప్రధానమైన మలేరియా, గృహ నిర్మాణ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు మాత్రం ఇంకా పూర్తిస్థాయి అధికారులు లేరు. ఈ శాఖలకు ఇన్‌చార్జిలే దిక్కయ్యారు. ఫలితంగా పాలనాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి.

మలేరియా శాఖ..

జిల్లా మలేరియా శాఖకు విజయనగరం జిల్లాకు చెందిన మలేరియా అధికారిని ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. రెండు జిల్లాలకు చెందిన బాధ్యతలను ఆమె చూస్తున్నారు. దీంతో ఏ జిల్లాపై కూడా పూర్తిస్థాయి దృష్టి పెట్టలేని పరిస్థితి ఆమెకు ఏర్పడింది. మన్యం జిల్లాలో ఏజెన్సీ ప్రాంతమే అధికం. గిరిజనులు నిత్యం మలేరియా వంటి వ్యాధుల బారిన పడుతుంటారు. దీనిపై జిల్లా మలేరియా అధికారి సమీక్షలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని స్వయంగా తెలుసుకోవాల్సి ఉంటుంది. కానీ, రెండు జిల్లాలకు ఒకే అధికారిని కావడంతో ఆమె మన్యం జిల్లాపై పూర్తిస్థాయి దృష్టిపెట్టలేకపోతున్నారు.


ఆర్అండ్‌బీ శాఖ కార్యాలయం


పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయం

గృహ నిర్మాణ..

గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరక్టర్ పోస్టు గత ఐదేళ్లుగా ఖాళీగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ గృహ నిర్మాణశాఖ జిల్లా అధికారిని ఆ శాఖకు సరెండర్ చేశారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో కొత్తవారిని నియమించలేదు. దీంతో ఆ శాఖ ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పర్యవేక్షణ కొరవడింది. జిల్లా ప్రజా ఆరోగ్య శాఖ అధికారి ఆర్.వంశీకృష్ణ ఇన్‌చార్జి పీడీగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు కూడా బదిలీ అయినట్లు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో ఆ శాఖపై పూర్తిస్థాయిలో దృష్టిసారించే అధికారి కరువయ్యారు.

ఆర్అండ్‌బీ ..

జిల్లాలో ఆర్అండ్‌బీ శాఖ పరిస్థితి దారుణంగా ఉంది. ఈ శాఖకు ఇంజనీరింగ్ అధికారి లేకపోవడంతో ఆ ప్రభావం అభివృద్ధి పనులపై పడుతోంది. ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న సాలూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇటీవల అనారోగ్యానికి గురై సెలవు పెట్టారు. దీంతో పనులను పర్యవేక్షించేవారు కరువయ్యారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు ముందుకు సాగడం లేదు.

పంచాయతీరాజ్..

జిల్లా పంచాయతీరాజ్ శాఖకు పూర్తిస్థాయి ఇంజనీరింగ్ అధికారి లేరు. గతంలో పనిచేసిన కృష్ణాజీ రిటైర్ కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం డీఈ నగేష్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. నిర్ణీత సమయంలో ఈ పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారిపై ఉంది. దీనికోసం ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటనలు, సమీక్షలు నిర్వహించాల్సి ఉంది. కానీ, ఆ పోస్టు ఖాళీగా ఉండడంతో పనులు సక్రమంగా జరగడం లేదు. ఇప్పటికైనా జిల్లా ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలో కీలక శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

పశుపోషకుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్
- నేటి నుంచి ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు

పార్వతీపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్రంలోని పశు పోషకులకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందిస్తుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లాలో సోమవారం నుంచి ఈ నెల 31 వరకు నిర్వహించనున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యానికి, పాల ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి, పశుపోషణ ఖర్చులు తగ్గించడానికి, రైతుకు ఆర్థిక అండను అందించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెటర్నరీ డిస్పెన్సరీ, వెటర్నరీ ఆసుపత్రుల పరిధిలోని గ్రామాల్లో పశువైద్య ఆరోగ్యశిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మథరావు మాట్లాడుతూ.. 'ఆరోగ్య శిబిరాల్లో వైద్యులు పశువులను పరీక్షించి ఉచితంగా చికిత్స అందిస్తారు. తేలికపాటి శస్త్ర చికిత్సలు కూడా నిర్వహిస్తారు. ఎదకు రాని, చూలు కట్టని, ఇతర గర్భకోశ వ్యాధులకు గురైన పశువులకు తగు వైద్యం అందిస్తాం. పాడి పశువులకు నట్టల నివారణ మందు తాగించడం వల్ల పాల ఉత్పత్తి పెరగడంతో పాటు పునరుత్పత్తి మెరుగుపడుతుంది. కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా అందిసున్నాం. పశుపోషకుల కోసం గోకులం, బహువార్షిక పశు గ్రాస క్షేత్రాలు, పశుబీమా, పశుకిసాన్, క్రెడిట్ కార్డులు, సంచార పశు ఆరోగ్యసేవా వాహనాలు, లింగనిర్ధారిత వీర్యం, పిండ మార్పిడి పరిజ్ఞానం వంటి పథకాలను అమలు చేస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో 23,940 గోకులాల యూనిట్లు మంజూరు చేయగా, 22,337 యూనిట్ల పనులు ప్రారంభించాం.' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.


పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్


ఆలయం వద్ద బారులు తీరిన మహిళలు

దేశమ్మ తల్లీ.. దీవించమ్మా

- అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సాలూరు రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సాలూరులోని దేశమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. మే నెలలో జరగనున్న సాలూరు గ్రామదేవత శ్యామలాంబ పండగ నేప థ్యంలో భక్తులు అధిక సంఖ్యలో దేశమ్మతల్లిని దర్శించుకుని, మొక్కు లు చెల్లించుకున్నారు. దేశమ్మతల్లీ.. దీవించమ్మా అంటూ వేడుకు న్నారు. వేకువజాము నుంచే క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తులు గంటల కొద్దీ క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చింది. ఒక దశలో తోపులాట చోటుచేసుకుంది. పట్టణ సీఐ అప్పలనాయుడు ఆదేశాలతో ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో అక్కడకు చేరుకుని, పరిస్థితి చక్కదిద్దారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

బాదుడే బాదుడు!

- ఇష్టారాజ్యంగా ప్రైవేటు బస్సుల్లో టిక్కెట్ల ధరలు
- నామమాత్రంగా రవాణా అధికారుల తనిఖీలు

7లో



భవన నిర్మాణాలను పూర్తిచేయండి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

8లో

భూ సమస్యలకు చెక్

- నేటి నుంచి సర్వే ప్రారంభం
- మొదటి విడతగా 15 గ్రామాలు ఎంపిక
- పకడ్బందీగా చేస్తామంటున్న సర్వే ఏడీ



జియ్యమ్మవలస, జనవరి 19(ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం భూహక్కు.. భూరక్ష పథకం పేరుతో చేపట్టిన భూ సర్వే లోపభూయిష్టంగా జరిగింది. రైతులను పిలవకుండానే సర్వే చేసి నచ్చినట్లు భూముల సరిహద్దులు, విస్తీర్ణం, సర్వే నెంబర్లు మార్చేశారు. ఫలితంగా కొందరికి భూములు తక్కువగాను, మరికొందరికి ఎక్కువగాను చూపించాయి. సర్వే నెంబర్లకు బదులుగా కొత్తగా ఎల్‌పీఎం నెంబర్లు కేటాయించడంతో మరిన్ని సమస్యలు వచ్చాయి. దీనిపై కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతులకు పూర్తి న్యాయం జరిగేలా, భూ సమస్య మరోసారి తలెత్తకుండా రైతుల సమక్షంలోనే సోమవారం నుంచి భూ రీసర్వే చేసేందుకు రంగం సిద్ధం చేసింది. దీనికోసం పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో 15 గ్రామాలను అధికారులు ఎంపిక చేశారు. ఆ గ్రామాల్లో నిర్దేశించిన ప్రాప్తి మేరకు సరిహద్దులను కూడా నిర్ధారించారు. రీసర్వేను పకడ్బందీగా చేస్తామని జిల్లా సర్వేయింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ టి.లక్ష్మణరావు స్పష్టం చేశారు.

తొలివిడత 8,789 ఎకరాల్లో..

జిల్లాలోని పాలకొండ, పార్వతీపురం డివిజన్ల పరిధిలో 15 మండలాలు ఉన్నాయి. మొదటి విడతగా ప్రతి మండలం నుంచి ఒక గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేశారు. పాలకొండ మండలంలో చినమంగళాపురం, భామినిలో మనిగ, జియ్యమ్మవలసలో రాజయ్యపేట, కురుపాంలో పెదవనజ, గుమ్మలక్ష్మీపురంలో గొరడ, సీతంపేటలో బూబాద్రి, వీరఘట్టంలో తూడి, పార్వతీపురం మండలంలో గోపాలపురం, కొమరాడలో శివరాంపురం, బలిజిపేటలో శివరాంపురం, సీతానగరంలో లచ్చయ్యపేట, మక్కువలో తూరుమామిడి, పాచిపెంట మండలంలో పూడి గ్రామాలను ఎంపిక చేశారు. ఈ 15 గ్రామాల్లో మొత్తం 8,789 ఎకరాల విస్తీర్ణంలో భూ రీసర్వే జరగనుంది. 5,432 మంది రైతులకు చెందిన 1,654 సర్వే నెంబర్లలో విమర్శలకు తావులేకుండా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ద్వారా సర్వే చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనికోసం 36 టీమ్‌లను ఏర్పాటు చేశారు.

అంతా సిద్ధం..

రీసర్వే విషయంలో జాయింట్ డైరెక్టర్ ఎస్ఎస్ శోభిక ఆధ్వర్యంలో జిల్లా సర్వేయింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ టి.లక్ష్మణరావు ఇప్పటికే సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రతి 200-250 ఎకరాలను ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేశారు. అవసరాన్ని బట్టి ప్రతి గ్రామంలో మూడు నుంచి నాలుగు టీమ్‌లు పని చేశాయి. ఇప్పటికే మండల తహసీల్దార్లకు, మండల సర్వేయర్లకు షెడ్యూల్ తయారు చేయాలని ప్రొసీడింగ్స్ ఇచ్చారు. అందులో గ్రామ విస్తీర్ణం, బ్లాక్ విస్తీర్ణం, ప్రభుత్వ, ఎసైన్డ్, దేవాదాయ, వక్ఫ్, ప్రైవేటు, గ్రామ కంఠం భూముల విస్తీర్ణాలు తెల్పాలన్నారు. రైతుల ఫోన్ నెంబర్లు, ఆధార్, బ్యాంక్ అకౌంట్ నెంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లు అప్‌డేట్ చేయడానికి కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుత వెబ్‌ల్యాండ్ 1బి ఎంట్రీలు చదివి రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి రిజిష్టర్‌లో నమోదు చేశారు. అక్కడే రైతులకు వ్యక్తిగత నోటీసులు ఇచ్చి వారి నుంచి తిరుగు రశీదులు స్వీకరించారు. ఇలా ఇప్పటికే ఆయా మండలాల తహసీల్దార్లు, మండల సర్వేయర్లు అంతా సిద్ధం చేసుకున్నారు.

రీసర్వే ఇలా చేస్తారు..

పైలట్ గ్రామాల్లో సోమవారం నుంచి రీసర్వే జరగనుంది. గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారి కచ్చితంగా రోజుకు 20 ఎకరాల్లో రీసర్వే పూర్తి చేయాలి. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఎల్‌పీఎంలు విభజించి ఒక్కొక్క రైతుకు ఆ ప్రాంత భూమిలో ఒక ఎల్‌పీఎం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఎక్కడ ఎటువంటి అవకతవకలు జరిగినా, రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినా చర్యలకు కూడా వెనుకాడబోమని జిల్లా యంత్రాంగం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

పేదల ఇళ్లు మరింత విశాలం

- గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్లు కేటాయించేందుకు ప్రభుత్వ నిర్ణయం
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు
- ఆనందం వ్యక్తం చేస్తున్న పేదలు



పార్వతీపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్లు మరింత విశాలంగా మారనున్నాయి. వారు ఇళ్లు కట్టుకునేందుకు అవసరమైన స్థలాల కేటాయింపులో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకున్నారంటూ పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ పరిస్థితి లేదు. పేదలు ఇళ్లు కట్టుకునేందుకు పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర స్థలాన్ని మాత్రమే కేటాయించేవారు. సెంటు, సెంటున్నర స్థలంలో ఇళ్ల నిర్మాణం కష్టంగా ఉండేది. తమకు నచ్చినట్లు పేదలు ఇళ్లు కట్టుకోలేకపోయేవారు. హాలు, వంట గది, బాత్‌రూం అన్నీ అందులోనే నిర్మించడంతో ఇరుకుగా ఉండేవి. కుటుంబంతో అందులో జీవించడం కష్టంగా మారేది. ఇంటికి ఎవరైనా బంధువులు గానీ వస్తే వారు కూర్చోవడానికి కూడా జాగా ఉండేది కాదు. ఇదిలాఉండగా, ఇళ్ల స్థలాలు కావాలని అనేక మంది దరఖాస్తు చేసినా చాలామందికి కేటాయించలేదు. ఫలితంగా పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కల నెరవేరలేదు. ఈ విషయమై అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైసీపీ ప్రభుత్వాన్ని పలుమార్లు నిలదీసిన సందర్భాలు ఉన్నాయి. తాము అధికారంలోకి వస్తే పట్టణ ప్రాంతాల్లోని పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంత పేదలకు మూడు సెంట్లు స్థలాన్ని కేటాయిస్తామని హామీనిచ్చారు. దీంతో పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమకు నచ్చినట్లు విశాలంగా గృహాలను నిర్మించుకునే వీలుంటుందని సంబరపడుతున్నారు.

టిడ్కో గృహాలు కేటాయిస్తే మేలు..

గత టీడీపీ పాలనలో అనేక మంది పేదలు టిడ్కో ఇళ్ల కోసం డీడీల రూపంలో సొమ్మును అప్పటి ప్రభుత్వానికి చెల్లించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ గృహాలను పేదలకు కేటాయించలేదు. చెల్లించిన డబ్బులు కూడా తిరిగి చెల్లించలేదు. దీంతో లబ్ధిదారులు నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేదలు కోరుతున్నారు. గతంలో డీడీలు చెల్లించిన వారికి ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనివల్ల తమకు ఎంతో మేలు జరగనుందని అంటున్నారు.

బాదుడే బాదుడు!

● ఇష్టారాజ్యంగా ప్రైవేటు బస్సుల్లో టిక్కెట్ల ధరలు
● నామమాత్రంగా రవాణా అధికారుల తనిఖీలు


ప్రైవేట్ ఆపరేటర్లకు సంబంధించిన బస్సులు

విజయనగరం క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఈనెల 9 నుంచి టిక్కెట్ల రేట్లు పెంచారు. వారం రోజులైనా ఇంకా తగ్గేదేలే అన్న చందంగా ఉంది. టిక్కెట్ల ధరల విషయమై గతంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. ఆర్‌టీఏ అధికారులు స్పందించారు. కేవలం ఒకే ఒక్కరోజు తనిఖీలు నిర్వహించి, 10 బస్సులను తనిఖీ చేశారు. రూ.45 వేల అపరాధరుసుం విధించారు. ఆ మరుసటి రోజు నుంచి ఆర్‌టీఏ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం మానేశారు. దాంతో మళ్లీ ప్రైవేట్ ఆపరేటర్లు రెచ్చిపోతున్నారు. టిక్కెట్ల ధరలను అమాంతం పెంచేశారు. విజయనగరం నుంచి విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట రోడ్డు నుంచి సాయంత్రం 4 గంటల నుంచి బస్సులు బయలుదేరుతాయి. వీటికి టిక్కెట్లు ముందే విక్రయించేస్తున్నారు. కొన్ని టిక్కెట్లను ఆన్‌లైన్‌లో కూడా బ్లాక్ చేసేస్తున్నారు. ఎవరైనా ఫోన్ చేస్తే, వారికి ఖరీదు చెప్పి, సదరు ప్రయాణికుడికి ఇష్టమైతేనే, వాటిని విక్రయిస్తున్నారు. ఇలా విజయనగరం నుంచి విజయవాడకు సిట్టింగ్ అయితే రూ.1400, స్లీపర్ క్లాస్‌కు రూ. 1600 నుంచి 2 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. విజయనగరం నుంచి హైదరాబాద్‌కు రూ.3 వేలకు పైమాటే. ఇలా ప్రైవేట్ యాజమాన్యాలు అందినకాడికి దోచుకుంటున్నారు. మరోవైపు ఆర్టీసీ కూడా ప్రత్యేక బస్సులు నడిపినప్పటికీ, తక్కువ కావడంతో ఎక్కువ మంది ప్రైవేటు ట్రావెల్స్ వైపే మొగ్గు చూపుతున్నారు.

నిబంధనలు తుంగలోకి..

విజయనగరం నుంచి విజయవాడ, హైదరాబాద్‌కు కేవలం ప్రయాణికులకు మాత్రమే తీసుకువెళ్లే అవకాశం ఆయా బస్సు యాజమాన్యాలకు ఉంది. అయితే ఆ నిబంధనను ఉల్లంఘించి కొరియర్ సంస్థల పార్సిల్స్‌ను అదే బస్సుల్లోనే తరలిస్తున్నారు. మరోవైపు సంక్రాంతి పండుగ మొదలుకుని నేటివరకూ ప్రైవేట్ బస్సులు ఒక్క డ్రైవర్‌తోనే రాకపోకలు సాగిస్తున్నాయనే వాదన బలంగా వినిపిస్తోంది. సుదూర ప్రాంతాలకు వెళ్లే సర్వీసులకు ఇద్దరు డ్రైవర్లు ఖచ్చితంగా ఉండాలనే నిబంధనను ప్రైవేట్ ఆపరేటర్లు తుంగలో తొక్కేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్‌టీఏ అధికారులు ప్రైవేట్ ట్రావెల్స్ ఆగడాలపై స్పందించని తీరు పలు విమర్శలకు తావిస్తోంది. ఇకనైనా ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీకి అడ్డకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పద్మావతి తొలగింపు?

విజయనగరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): విజయనగరం గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతిని తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. వైసీపీ హయాంలో నియమితులైన వారందరినీ కూటమి ప్రభుత్వం వారిని బాధ్యతల నుంచి తప్పిస్తోంది. అందులో భాగంగానే విజయనగరం గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తొలగించినట్టు తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వం నుంచి అధికారికంగా ఈనెల 20న ఉత్తర్వులు విడుదల కానున్నట్టు తెలిసింది.

సూర్య నమస్కారాలపై శిక్షణ

శృంగవరపుకోట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలోని మోక్ష విద్య యోగమందిర్‌లో ఈనెల 21నుంచి 15 రోజుల పాటు ఉచిత సూర్య నమస్కారాల శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూర్య నమస్కారాల వల్ల భక్తితో పాటు ఎంతో ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. రథసప్తమి నాటికి ఇక్కడ శిక్షణ పొందిన వారితో 108 రౌండ్ల సూర్య నమస్కారాలు చేయిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు 9989368781, 9866757311లను సంప్రదించాలని కోరారు.

స్పర్శ లేని మచ్చలపై సర్వే

దత్తిరాజేరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరపుకొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.రఘు ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి స్పర్శ లేని మచ్చలపై సర్వే జరుగనుంది. ప్రతీ గ్రామంలో ప్రతీ ఇంటిని సందర్శించనున్నారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, తిమ్మిర్లు, నరాల బలహీనత వంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వారికి మందులు ఇవ్వనున్నామన్నారు.

తోటపల్లి ఈఈకి పదోన్నతి

రాజాం, జనవరి 19, (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు రాజాం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) రెడ్డి రామచంద్రరావుకు పోలవరం హెడ్ వర్క్స్ సర్కిల్ ఎస్ఈగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన పదోన్నతల జాబితాలో ఆయన పేరు ఖారారైనట్లు స్థానిక ప్రాజెక్టు వర్గాలు వెల్లడించాయి. ఈఈ క్యాడర్‌లో ఆయన 12 ఏళ్ల పాటు వివిధ ప్రాంతాల్లో పనిచేసిన అనుభవం ఉంది. తోటపల్లి రాజాం డివిజన్ ఈఈగా పదేళ్లు, వంశధార ప్రాజెక్టు హిరమండలం డివిజన్ ఈఈగా ఏడాది, ఇంకా విశాఖ నార్త్ కోస్టు చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా ఏడాది పనిచేశారు.

బాల అన్నమ్మ సేవలో ఎమ్మెల్యే

సంతకవిటి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సురవరం గ్రామంలో బాల అన్నమ్మ అమ్మవారిని ఆదివారం రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయరారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు కొల్ల అప్పలనాయుడు, వల్లూరు గణేష్, గట్టి రఘుబాబు తదితరులున్నారు.

రహదారి భద్రత.. మీ బాధ్యత

శృంగవరపుకోట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఆర్టీసీ డ్రైవర్ రహదారి భద్రత తన బాధ్యతగా భావించి విధులు నిర్వర్తించాలని ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ అన్నారు. ఆదివారం డిపోలో నిర్వహించిన రహదారి భద్రత మాసోత్సావాల్లో భాగంగా డ్రైవర్లు, గ్యారెజ్ సిబ్బందికి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

ఘనంగా వరుణ్ తేజ్ జన్మదిన వేడుకలు

రాజాం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ జన్మదిన వేడుకలు ఆదివారం చిరంజీవి అభిమాన సంఘం ఘనంగా నిర్వహించింది. కేక్ కట్ చేసి అభిమానాన్ని చాటుకున్నరు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. చిరంజీవి అభిమాన సంఘం ప్రెసిడెంట్ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ ఎ.జనార్దన్, సెక్రటరీ బి.రమణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, జి.కొండలరావు పాల్గొన్నారు.

పద్యాల రూపంలో ఆధ్యాత్మిక జ్ఞానం


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి పద్యాల రూపంలో వేమన భగవాన్ అందించిన ఆధ్యాత్మిక జ్ఞానం చాలా గొప్పదని ఎమ్మెల్యే ఎమ్మెల్యే అదితి గజపతి రాజు కొనియాడారు. ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక సంయుక్తంగా ఆదివారం విజయనగరంలో ఆధ్యాత్మిక కవి వేమన భగవాన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం టీటీడీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ రఘువర్మ, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు. ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు వానపల్లి శంకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ వేమన పద్య మకుటంలో ఆత్మ, జీవాత్మ, పరమాత్మలతో కూడిన జ్ఞానం ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించిన ప్రబోధా సేవా సమితి, ఇందూ జ్ఞానవేదికలనుఅభినందించారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, బాలల హక్కుల చైర్మన్ కేసలి అప్పారావు, కరణం జనార్దనరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామానందం, జాతీయ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.బ్రహ్మారెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పలువురికి కోండ్రు పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

రాజాం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు కుటుంబాలను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదివారం పరామర్శించారు. మొగులివలస గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గార చిన్నంనాయుడు ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అదే గ్రామానికి చెందిన పోతురాజు అప్పలనాయుడు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు వంగా వెంకటరావు, గురవాన నారాయణరావు, మడ్డు హరి తదితరులు పాల్గొన్నారు.

● రేగిడి: మండలంలోని పెద్దశిర్లాం, చిన్నశిర్లాంల్లో టీడీపీ నేతలు పాలవలస రామచంద్రినాయుడు, మంతిన ఉషారాణిలకు చెందిన కుటుంబ సభ్యులు ఇటీవల మృతి చెందడంతో ఆదివారం వారిని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పరామర్శించారు. ఆయన వెంట రేగిడి, రాజాం టీడీపీ నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, గురవాన నారాయణరావు ఉన్నారు.

రక్షిత నీటికి చర్యలు చేపడతా..


తాగునీటిని పరిశీలిస్తున్న సురేష్‌బాబు

వంగర, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కలుషిత జలాల నుంచి నీలయ్యవలస ప్రజలకు రక్షణ కల్పిస్తానని జనసేన రాజాం నియోజకవర్గ నాయకుడు, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి పొగిరి సురేష్‌బాబు అన్నారు. రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. తాగునీరు కలుషితంపై నీలయ్యవలస ప్రజలు ఆయనకు ఫిర్యాదు చేయటంతో ఆయన స్పందించారు. ఆదివారంలో గ్రామంలో తాగునీటి వనరులను పరిశీలించారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే. నీలయ్యవలస రోడ్డు గోతులమయంగా రాజాం నుంచి బస్సు సర్వీసు నిలిచిపోయిందని దాంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆయన ఫిర్యాదు చేశారు. డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని వారికి సురేష్‌బాబు హమీ ఇచ్చారు. ఆయన వెంట జనసేన నాయకులు తవిటినాయుడు, వెంకటనాయుడు, ఆదినాయుడు తదితరులున్నారు.

డిప్యూటీ సీఎం పదవికి లోకేశ్ అర్హుడే..


గద్దె బాబురావు

చీపురుపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఉప ముఖ్యమంత్రి పదవికి అన్ని రకాలుగా అర్హతలున్న వారేనని పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ గద్దె బాబురావు అన్నారు. ఆదివారం ఆయన చీపురుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు రికార్డు స్థాయిలో కోటి దాటాయంటే అది లోకేశ్ గొప్పతనమేనన్నారు. కొద్ది కాలంలోనే పార్టీలో దక్షత కలిగిన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. రాజకీ యంగా చాలా పరిణితి సాధించారని, అటువంటి వ్యక్తికి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వడం మంచిదేనని అభిప్రాయపడ్డారు. కడప తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి ప్రతిపాదన సమర్ధనీయమేనని బాబురావు అన్నారు.

ఇదేం పంచాయితీ?

● పుణ్యగిరి శివరాత్రి జాతరను రాజకీయ కోణంలో చూస్తున్న పాలక మండలి
● ఇప్పటికే కోరం లేక రెండుసార్లు సాధారణ సమావేశం వాయిదా
● నేడు పాలక మండలి సమావేశం


ఎస్.కోట పంచాయతీ కార్యాలయం

శృంగవరపుకోట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 26న మహాశివరాత్రి. శృంగవరపుకోట పుణ్యగిరి కొండపై మూడు రోజుల పాటు జాతర జరుగుతుంది. సుమారు లక్ష మందికు పైబడి భక్తులు స్వామిను దర్శించుకునేందుకు వస్తారు. అందుకు ఇక్కడ పెద్దఎత్తున సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఇందుకు అయ్యే ఖర్చు స్థానిక పాలక మండలి ఆమోదం తప్పనిసరి. అందుకే పాలకమండలి సమావేశం అజెండాలో ప్రధాన అంశంగా దాన్ని చేర్చారు. అయితే పాలక మండలిలో విబేధాల కారణంగా దానిపై చర్చించేందుకు సభ్యులు ఆసక్తి చూపడంలేదు. డిసెంబరు 28న, ఈనెల 8న నిర్వహించిన సమావేశాలకు ఐదుగురు, ఆరుగురు మించి సభ్యులు హాజరుకాలేదు. కోరం లేకపోవడంతో రెండుసార్లు సమావేశాన్ని వాయిదా వేశారు. ఈనేపథ్యంలో సోమవారం మళ్లీ సమావేశం నిర్వహించనున్నట్లు పంచాయతీ అధికారులు ప్రకటించారు. సభ్యులకు సమాచారం అందించారు. ఈసారైనా సభ్యులు హాజరవుతారా, లేదా వేచి చూడాల్సిందే.

శృంగవరపుకోట పట్టణ ప్రాంతాన్ని పోలిన గ్రామం. జిల్లాలో అతిపెద్ద పంచాయతీ ఇది. ఈ పాలకమండలి అధికారం చేపట్టిన నాటి నుంచి అత్యధిక శాతం మంది సభ్యులు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతల చెప్పుచేతల్లో పనిచేస్తున్నారు. వర్గాలుగా వీడి ముగ్గురు నేతల కనుసన్నల్లో నడుస్తున్నారు. దాంతో వారు అభివృద్ధి పనులన్నింటినీ రాజకీయ కోణంలోనే చూస్తున్నారు. ఎవరికి వారే పైచేయి అనిపించుకునేందుకు యత్నాలు చేస్తున్నారు. దాంతో పంచాయతీలో చెప్పుకోదగిన అభివృద్ధి కార్యక్రమాలేవీ జరగడంలేదు. నాలుగేళ్ల క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గనివాడ సంతోషికుమారితో సహ 14 మంది సభ్యులు వైసీపీ మద్దతుతో గెలిచారు. అప్పటి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సహకారంతో 5 గురు టీడీపీ మద్దతుదారులు నెగ్గారు. 13వ వార్డు సభ్యుడు చిప్పాడ శేషగిరిరావు స్వతంత్రంగా ఎన్నికయ్యారు. అయితే ఎన్నిక నాటి నుంచి వైసీపీ మద్దతుతో గెలిచిన సభ్యులు రెండుగా చీలిపోయారు. మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేరో వర్గాన్ని ప్రోత్సాహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పర్యవసానంగా తరచూ వివాదాలు చోటు చేసుకున్నాయనే విమర్శలు ఉన్నాయి. సర్పంచ్‌తో పాటు ఐదారుగురు మాత్రమే పంచాయతీ సమావేశాలకు హాజరవుతున్నారు తప్ప మిగిలిన వారెవరూ పంచాయతీ కార్యాలయం వైపు కన్నెత్తి చూడటంలేదు. ఈనేపథ్యంలో పాలక మండలిలో విబేధాలను పరిష్కరించాల్సిన పాలకులు మౌనం దాల్చడంతో పంచాయతీలో అభివృద్ధి అటకెక్కింది.

తోట కల్లాలకు రోడ్డు ఏర్పాటు చేయండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

వేపాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపురం గ్రామ శివారు తోట కల్లాలకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈమేరకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకుని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను రోడ్డు సమస్యను వివరించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జాగరపు రాము, గొర్రిపోటు నల్లబాబు, గొర్రుపోటు శేఖర్ చల్లా నాయుడు, గోర్రిపోటు ప్రసాద్ తదితరులున్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులను అభినందిస్తున్న విజయభార్గవి

విజయనగరం దాసన్నపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నేపాల్ పోకరాలో జరిగిన ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్సు చాంపియన్‌షిప్‌లో విజయం సాధించిన విజేతలను బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు అవనాపు విజయ భార్గవి అభినందించారు. ఆదివారం విజయం సాధించిన బాక్సింగ్ క్రీడాకారులు మర్యాదపూర్వకంగా ఆమెను కలిశారు. ఈ సందర్భంగా విజయభార్గవి మాట్లాడుతూ జిల్లాకు చెందిన క్రీడాకారులు ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్సు చాంపియన్‌షిప్‌లో విజయం సాధించడం అభినందనీయమన్నారు. 11 మంది క్రీడాకారులు పాల్గొనగా నాలుగు బంగారు పతకాలు, మూడు కాంస్య పతకాలు సాధించడాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో కోచ్ పూజారి సీతారామంజనేయులు ఉన్నారు.

ఏరియా ఆస్పత్రిలో వ్యక్తి ఆత్మహత్య

క్రైం కార్నర్

పాలకొండ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పాలకొండ ఏరియా ఆస్పత్రిలోని మేల్ వార్డు బాత్‌రూంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వీరఘట్టం మండలం తలవరం గ్రామానికి చెందిన బెవర జోగినాయుడు(45) కడుపు నొప్పితో బాధపడుతూ శనివారం పాలకొండ ఏరియా ఆసుపత్రిలో చేరాడు. అయితే ఆదివారం తెల్లవారుజామున ఆసుపత్రిలోని మేల్ మెడికల్ వార్డు బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆసుప్రతి సిబ్బంది వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో నాలుగు పర్యాయాలు ఇదే ఆసుపత్రిలో జోగినాయుడు చికిత్స కోసం చేరాడు. కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి తరలించారు. మృతుడి బంధువులు అక్కడకు చేరుకుని పోస్టుమార్టం చేయవద్దని ఆందోళనకు దిగడంతో సీఐ చంద్రమౌళి వచ్చి నచ్చజెప్పారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి జోగినాయుడు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య కల్యాణి, ఇద్దరు పిల్లలు వెంకటేష్, సూర్యకళ ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విజయనగరం క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని దాసన్నపేట మెయిన్ రోడ్డు జంక్షన్ సమీపంలో మురికి కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతుడు ఎర్రని షర్టు ధరించి ఉన్నాడన్నారు. గుండు, గెడ్డం ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు టూటౌన్ పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

డెంకాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులపేట శివార్లలో ఆరుగురు పేకాటరాయుళ్లను ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ సన్యాసి నాయుడు తెలిపారు. వారి నుంచి రూ.40,960 నగదు, 8 సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

252 మంది మందుబాబులపై కేసులు

విజయనగరం క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజాశాంతికి భంగం కలిగిస్తే, కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈనేపథ్యంలో జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి 252 మంది మందుబాబులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అలాగే వాహన తనిఖీలు ఆకస్మికంగా నిర్వహించి ఎనిమిది మద్యం సీసాలు, నాలుగు పశువులు, ఒక వ్యాన్‌ను సీజ్ చేశారు. రహదారి భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై 386 కేసులు నమోదు చేశారు. రూ.95,205 అపరాధ రుసుం విధించారు. 29 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు.

పాలవలసకు నివాళి

రాజాం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మాజీ రాజ్యసభ సభ్యుడు, ఉత్తరాంధ్ర రాజకీయ దిగ్గజం పాలవలస రాజశేఖరం మృతి చెందిన నేపథ్యంలో ఆదివారం ఆయన నివాసానికి రాజాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ వెళ్లారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని పరామర్శించారు. ●అలాగే తూర్పుకాపు వర్కింగ్ ప్రెసిడెంట్ మక్క సాయి బాబనాయుడు పాలవలస చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని కలిసి పరామర్శించారు.

ఎమ్మెల్సీ, ఎంపీపీలకు వినతిపత్రం


వినతిపత్రం ఇస్తున్న రేగ పుణ్యగిరి గిరిజనులు

శృంగవరపుకోట రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఎస్. కోట శివారు గిరిశిఖర గ్రామం రేగ పుణ్యగిరి గిరిజనులు ఆదివారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావులను బొడ్డవరలో కలిశారు. ఎంపీటీసీ దారగిరి, వార్డుసభ్యుడు అర్జున్ మాట్లాడుతూ ఇటీవల కలెక్టర్ వచ్చి గ్రామానికి రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీ త్వరితగతిన నెరవేరేలా చూడాలని వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధారాజు, ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ సంతోషికుమారి తదితరులు ఉన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

దత్తిరాజేరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినసామలాపల్లి గ్రామంలో శనివారం జరిగిన ఇరువర్గాల ఘర్షణలో గాయపడిన క్షతగాత్రులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తండ్రి, మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు ఆదివారం పరామర్శించారు. గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులను మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, కబడ్డీ అసోషియేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ రంది అర్జున్, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా పర్యటనపై నిరసన

విజయనగరం దాసన్నపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటనను నిరసిస్తూ ఆది వారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సీపీఐఎంఎల్ జిల్లా నాయకులు బెహరా శంకరరావు మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షా నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నేతలు రెడ్డి శంకరరావు, టీవీ రమణ పాల్గొన్నారు.

●శృంగవరపుకోట రూరల్: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాకను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఎస్.కోటలో ఆదివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. పార్టీ నాయకులు మద్దిల రమణ, గాడి అప్పారావు, చల్లా జగన్, చెలికాని ముత్యాలు, పైడిరాజు తదితరులున్నారు.

● నెల్లిమర్ల: డాక్టర్ అంబేడ్కర్‌ను కించపరిచిన కేంద్ర మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనపై సీపీఎం, సీపీఐ, న్యూడెమొక్రసీ నాయకులు నెల్లిమర్లలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు కిల్లంపల్లి రామారావు, సీపీఐ నాయకుడు మొయిద పాపారావు, న్యూడెమొక్రసీ నాయకుడు కాళ్ల అప్పలసూరి, కాంగ్రెస్ నాయకుడు కాళ్ల అప్పలసూరి, కనకల రాము, సుంకర అప్పారావు, సత్యారావు, అప్పన్న, పి.సూరి పాల్గొన్నారు.

సందడిగా అ'పూర్వ' సమ్మేళనం


ఎస్.కోట రూరల్: భర్తపురం సమీపంలో..


గంట్యాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో..

శృంగవరపుకోట రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భర్తపురం సమీపంలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం సందడిగా జరిగింది. ఎస్.కోట ఆర్‌సీఎం పాఠశాల నుంచి ప్రభుత్వ కళాశాలలో చదువుకున్న వారంతా 54 ఏళ్ల తర్వాత ఒకేచోటుకు చేరి ఉత్సాహంగా గడిపారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. శ్రీనాథు వెంకన్నబాబు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన పూర్వ విద్యార్థులను ఆదుకుంటామన్నారు.

●గంట్యాడ: గంట్యాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1986-89 మధ్య చదివిన పూర్వ విద్యార్థులు వారు చదువుకున్న పాఠశాలలో కలిశారు. పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించారు.

మట్టిరోడ్డు కాదు.. తారురోడ్డే!


గోల్డ్‌స్టార్‌కు వెళ్లే బీటీ రోడ్డు ఇదే..

లక్కవరపుకోట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారి జంక్షన్ నుంచి గేదెలవానిపాలెం, గోల్డ్‌స్టార్‌కు వెళ్లే బీటీ రోడ్డు మట్టిరోడ్డును తలపిస్తోంది. సుమారు ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు యావత్తూ రైపు కోల్పోయింది. ఈ రోడ్డును బాగుచేయాలంటూ అధికారులకు పలుమార్లు చెప్పినా ఫలితం లేదంటూ కొత్యాడ, తలారి గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వ హయంలోనైనా రోడ్డుకు మరమ్మతులు జరుగుతాయని స్థానికులు భావించినప్పటికీ వారి ఆశలు అడియాసలే అయ్యాయి. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని దాసుల్లుపాలెం, కొత్యాడ, తలారి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాగు చేశారు.. వదిలేశారు

- నిరుపయోగంగా వీరఘట్టంలోని తూకం యంత్రం
- పట్టించుకోని అధికారులు



వినియోగంలో లేని తూకం యంత్రం

వీరఘట్టం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని సివిల్ సప్లై అధికారులు ఏర్పాటు చేసిన తూకం యంత్రం మరమ్మతులు చేసినా వినియోగంలోకి తీసుకురాలేదు. ధాన్యం, కూరగాయల రైతుల సంక్షేమం కోసం పౌరసరఫరాల శాఖ అధికారులు తూకం యంత్రం రెండేళ్ల కిందట ఏర్పాటుచేశారు. అయితే అధికారుల నిరక్ష్యం, నిర్వహణ లేకపోవడంతోపాటు వినియోగించడానికి చర్యలు తీసుకోకపోవడం తోపాటైంది. దీంతోఇటీవల తూకం యంత్రాన్ని మరమ్మతులుచేసినా వినియోగంలోకి తీసుకురాలేదు. యంత్రం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు కనీసం ఒక్కబస్తా కూడా తూకం వేయలేదు. దీంతో యంత్రం నిర్వహణలో అధికారుల సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని రైతులు చెబుతున్నారు. మండలంలో రైతులు వరితోపాటు కూరగాయల పంటలు ఎక్కువగాసాగు చేస్తున్నారు. కూరగాయల పంటలను విశాఖ, శ్రీకాకుళం భువనేశ్వర్ వంటి పట్టణాలకు రైతులు ఎగుమతి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన యంత్రం అందుబాటులో ఉండడంతో కచ్చితమైన తూకం వచ్చి మేలు జరుగతుందని రైతుల నమ్మకం. దళారులు నుంచి మోసపోకుండా ఉపయోగపడుతుంది. ఇక్కడి యంత్రం వినియోగం లోకి తీసుకురావడంతో ప్రైవేటుగా ఏర్పాటుచేసిన కాటాను ఆశ్రయించాల్సివస్తోందని రైతు లు వాపోతున్నారు. కాగా తూకం యం త్రం మరమ్మతులు పూర్తయ్యాయని, పరిశీలించి వినియోగంలోకి తీసుకురావడాని కి చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లై డీఎం పి.శ్రీనివాసరావు తెలిపారు.

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

- అలజంగి వద్ద వేగావతి నదిలో కానరాని తనిఖీలు
- పొంచి ఉన్న ముప్పు

బొబ్బిలి రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలజంగి శివారున వేగావతి నదిలో తనిఖీలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. గనులు, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారుల ఉదాసీనత వల్ల అక్రమంగా తవ్వకాలు జరిపి కొందరు ఇసుకను తరలిస్తున్నారు. నిత్యం ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోడంతో వారి ఆగడాలకు అడ్డులేకుం డాపోయింది. ప్రధానంగా పలు గ్రామాలకు తాగునీరందించే మూడు ఊటబావుల వద్ద ఇసుక తవ్వకాల వల్ల రానున్న వేసవిలో తాగు నీటికి ముప్పుపొంచిఉందన్న ఆందోళన నెలకొంది. తక్షణమే అధికారులు స్పందించి ఊటబావుల వద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అలజంగి తదితర గ్రామస్థులు కోరుతున్నారు. ఇసుక తవ్వకాల వల్ల ఊటబావులు కుంగిపోవడంతోపాటు డిసెంబరు నుంచే వాటిలోకి నీరుచేరని పరిస్థితి నెలకొంది. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. కాగా అలజంగి శివారులో వేగావతి నది నుంచి ఇసుక తవ్వకునే అనుమతి గనుల శాఖ నుంచి లేదని, నదిలో ఏమి జరుగుతుందో తమకు తెలియదని పంచాయతీ కార్యదర్శి నారాయణరావు తెలిపారు.



అలజంగి వద్ద వేగావతి నదిలో ఇసుక తవ్వకాలతో కుంగిపోయిన ఇన్‌ఫిల్ట్రేషన్ బావి

అడుగడుగునా గుంతలు

- చినుకు పడితే తప్పని అవస్థలు
- ఇదీ సన్యాసిరాజుపేట రహదారి దుస్థితి

గరుగుబిల్లి, జనవరి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుడబ పంచాయతీ పరిధిలో గల సన్యాసిరాజుపేట రహదారి నిర్వహణ లేకపోవడంతోపాటు మరమ్మతులకు నోచుకోవడంలేదు. దీంతో చినుకుపడితే అధ్వానంగా మారుతోంది. ప్రధాన రహదారి మార్గం గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బీటీ రహదారి నిర్మించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాం నిర్వహణపై నిర్లక్ష్యం ప్రదర్శించిందని పలువురు వాహనచోదకులు వాపోతున్నారు. గతఏడాది అక్టోబరు, నవంబరులో కురిసిన వర్షాల వల్ల రోడ్డంతా రాళ్లుతేలడంతో గోతులమయంకావడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు, ప్రయాణికులు వాపోతున్నారు. సన్యాసిరాజుపేట రహదారి మీదుగా రాయిందొరవలస పంచాయతీ ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డంతా దెబ్బతినడంతో ఆర్టీసీ అధికారులు బస్సు నడపడానికి ముందుకురావడంలేదు. దీంతో ఈరెండు గ్రామాల కు సంబంధించి బస్సు సౌకర్యం లేకపోవడం తో ఆటోలపైనే ఆధారపడుతున్నారు. రహ దారికి ఇరువైపులా లోతైన పెద్ద చెరువు, పంట పొలాలు ఉన్నాయి. ఏ మాత్రం అదుపు తప్పినా వాహనాలు చెరువు, పంట పొలాల్లోకి దూసుకువెళ్తున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఉండడంతో ఈ మార్గంలో చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించే వారు భయాందోళన చెందుతున్నారు. కొన్నిసార్లు వాహనాలు బోల్తా పడుతున్నాయని పలువురు వాపోతున్నారు. రహదారిపై పెద్దపెద్ద గోతుల వల్ల పార్వతీపురం సమీపంలోని నర్సిపురం మీదుగా వాహనాలపై రావల్సి వస్తోందని సన్యాసిరాజుపేట గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు దృష్టిసారించి రహదారిమరమ్మతులకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.ప్రీమాన్సూన్ పిరియడ్ సమయంలో అడపాదడపా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో అవస్థలు తప్పవని, రహదారి మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.



సన్యాసిరాజుపేట వెళ్లే ప్రధాన రహదారి గోతుల్లో చేరిన వర్షపు నీరు(ఫైల్)

ఎంపీటీసీని గాయపర్చిన ఇద్దరి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

సాలూరు/ పాచిపెంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండలంలోని పాంచాళి ఎంపీటీసీ సభ్యుడు పాంచాళి ఉమామహేశ్వరరావును కత్తితో గాయపర్చిన ఇద్దరిని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం సాలూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన ఈ ఘటనకు సంబంధించి వివరాలు వెల్లడించారు. మండలంలోని మోసూరుకు చెందిన ఉణుకూరు జోసెఫ్, మోసూరు శివాజీలు ఈనెల 16వ తేదీన మద్యం మత్తులో ఎంపీటీసీ సభ్యుడు ఉమామహేశ్వరరావుపై కత్తితో దాడి చేశారని చెప్పారు. అందిన ఫిర్యాదు మేరకు నిందితులను పట్టుకుని అరెస్టు చేశామన్నారు. దాడి సమయంలో దోచుకున్న సెల్‌ఫోన్లు, నగదును, ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాచిపెంట ఎస్‌ఐ వెంకటసురేష్ ఉన్నారు.

వేమన గొప్ప మానవతావాది

పార్వతీపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన గొప్ప మానవతావాది అని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో యోగివేమన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని, వేమన చి త్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కవిగా, యోగిగా వేమన ప్రజాదరణ పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో కేఆర్ఆర్‌సీడీఎస్‌డీసీ డాక్టర్ పి.ధర్మచంద్రరెడ్డి, కలెక్టర్ కార్యాలయ విభాగం పర్యవేక్షకుడు శ్రీరామ్మూర్తి, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



ర్యాలీ చేస్తున్న వామపక్ష నాయకులు

బెలగాం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు అమిత్‌షా ఆంధ్రప్రదేశ్ పర్యటనను రద్దు చేయాలని కోరుతూ పార్వతీపురం బస్టాండ్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని, బీజేపీకి రాజ్యాంగ నిర్మాత పట్ల గౌరవం లేదని వామపక్ష నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు బీవీ రమణ, పి.సంఘం, పి.రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి పథకాన్ని నిర్మించండి

గుమ్మలక్ష్మీపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో రక్షిత తాగునీటి పథకాన్ని నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. 1985 సంవత్సరంలో నిర్మించిన 20వేల లీటర్ల కెపాసిటీ ఉన్న రక్షిత పథకాన్ని నేటికీ వినియోగిస్తున్నారు. ఈ పథకం శిథిలావస్థకు చేరింది. దీంతో నూతనంగా రక్షిత తాగునీటి పథకం నిర్మించాలని గ్రామ వాసులు కోరుతున్నారు. 1985 సంవత్సరానికి ఇప్పటికీ జనాభా మూడు రెట్లు పెరిగిందని, ఈ కారణంగా 60 వేల లీటర్ల కెపాసిటీ ఉన్న రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. నూతన ప్రభు త్వంలోనైనా నిధులు మంజూరు చేసి పథకాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

రామభద్రపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహనచోదకునికి గాయాలైనట్లు ఏఎస్ఐ ఆర్.అప్పారావు తెలిపారు. ఏఎస్ఐ కథనం మేరకు.. విశాఖపట్నంలోని షీలానగర్‌కు చెందిన బంకురు బాబ్జీ సంక్రాంతి కోసం రామభద్రపురంలోని పూడివీధికి చెందిన తన బంధువు కునుకు గౌరీశంకర్ ఇంటికి వచ్చాడు.ఆదివారం బొబ్బిలిలోని తన మేనకోడలు ఇంటికి వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు.చౌక్కాపువాని చెరువులు వద్ద వెనుకనుంచి వస్తున్న ఆర్టీసీబస్సు ఢీకొనడంతో అప్పారావు గాయపడ్డాడు. దీంతో 108లో బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.ఈమేరకు కేసు నమోదుచేశారు.

వరి కుప్పలు దగ్ధం

తెర్లాం జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరాడలో గుండరాయి దగ్గర ఆదివారం నాలుగు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. స్థానికులు రాజాం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేయడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రైతులు ముత్తా నగేష్, తిరుపతి, రేజేటి లచ్చుము, కుసుమూరు పెంటయ్యకు చెందిన వరికుప్పలు కాలిపోయాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందివచ్చిన సమయంలో అగ్నికి ఆహుతి కావడం పట్ల బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారంతా కోరుతున్నారు.

రాజాం రచయితల వేదిక వార్షికోత్సవం

రాజాం, జనవరి19(ఆంధ్రజ్యోతి): రాజాంలో రాజాం రచయితల వేదిక (రారవే) దశమ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా శశాంక విజయం కావ్య సౌరభం అన్న అంశంపై సాహితీవేత్త ఒమ్మి రమణమూర్తి మాట్లాడారు. నేతేటి గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్వాహకుడు గార రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత



బాధితులకు చెక్కును అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తుండ పంచాయతీ చినఊటగెడ్డకు చెందిన నడిమింటి వెంకటమ్మకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఆమె భర్త తిరుపతిరావుకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం అందజేశారు. వెంకటమ్మ అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2లక్షల 50వేల 216 మంజూరయ్యింది. ఈ చెక్కును మంత్రి తన నివాసంలో తిరుపతిరావుకు అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పరమేష్, యుగంధర్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించిన వారికి పండ్లు పంపిణీ

బొబ్బిలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని పాతబొబ్బిలి గాంధీ స్మారకనిధి సంస్థకు చెందిన బాలలతో ఆదివారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థ ప్రతినిధి మింది విజయమోహన్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలలను సీఐ కటకం సతీష్‌కుమార్ అభినందించారు. ట్రాఫిక్ ఎస్ఐ ఆదిత్య పాల్గొన్నారు.

వాహన చోదకులకు అవగాహన

సీతానగరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహన దారులకు, ఆటో డ్రైవర్లకు ఎస్ఐ ఎం.రాజేష్ ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటోలో ప్రయాణికులను డ్రైవర్‌కు ఇరువైపులా కూర్చోవడానికి అనుమతించవద్దన్నారు. ద్విచక్ర వాహనాన్ని నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు, లైసెన్స్ లేని వ్యక్తులకు వాహనాన్ని నడపడానికి అనుమతించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరావుతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గుడి పండగ

భామిని, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): భామినిలోని ఎమ్మార్సీ చర్చి ఆవరణలో గ్రామ యువత ఆధ్వర్యంలో గుడి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం జోసెఫ్ డి.దేవరాజు, బత్తిలి ఫాదర్లు బి.సంజీవ్, ప్రతాప్ ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ముందుగా ఏసు విగ్రహానికి పురవీధుల్లో ఆటలు, పాటలు, ప్రార్థనలతో ఊరేగించారు. పండగలో బత్తిలి, లివిరి గ్రామాల నుంచి క్రైస్తవులు పాల్గొన్నారు.



ఊరేగింపులో నృత్యం చేస్తున్న బాలికలు

భవన నిర్మాణాలను పూర్తిచేయండి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి



మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. మండలంలో పలు గ్రామాల్లో నిర్మిస్తున్న మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. మండ గ్రామంలో సీసీడీపీ పథకం ద్వారా ఏర్పాటు చేస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు పరిశీలించారు. అక్కడి నుంచి కుసిమి పీహెచ్‌సీని పరిశీలించి బయో వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అనంతరం ఆడలి వ్యూ పాయింట్‌కు వెళ్లే మార్గంలో గడచిన రెండు రోజుల కిందట జరిగిన ఆటో ప్రమాదాని కి గురైన వెల్లంగూడ మలుపును ఆయన పరిశీలిం చారు. మలుపుల వద్ద రక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



మృతుడి కుటుంబ సభ్యులతో చర్చిస్తున్న ఏజేఏసీ నాయకులు

సీతంపేట రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన సవర రెల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం, ఐటీడీఏ ఆదుకోవాలని ఏజేఏసీ నాయకులు బి.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం వెల్లంగూడ గ్రామంలో ఆటో ప్రమాదంలో మృతిచెందిన రెల్లయ్య అంత్యక్రియల్లో వీరు పాల్గొని మాట్లాడారు. సవర రెల్లయ్య అకాల మృతితో ఆయన కుటుంబం రోడ్డున పడిందని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు అన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని ఆడలి వ్యూ పాయింట్ మార్గంలో ఉన్న ప్రమాదకర మలుపుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏజేఏసీ నాయకులతో పాటు సర్పంచ్ ఎన్.తిరుపతిరావు, ఉపసర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సభ్యుడు జెమ్స్ ఉన్నారు.

నిధులు లేక.. నిర్మాణాలు పూర్తికాక

- అర్థాంతరంగా ఐటీడీఏ పార్కు దుకాణ భవనాలు
- చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిన వైనం
- దృష్టి సారించని అధికారులు



దుకాణాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిన దృశ్యం

గరుగుబిల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పార్కు అభివృద్ధికి నిధుల కొరత వెంటాడుతోంది. తోటపల్లి ప్రాజెక్టుకు ఆనుకుని ఉన్న ఈ పార్కును అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు ఐదేళ్ల కిందట ఇక్కడ నాలుగు దుకాణ భవనాలు నిర్మించారు. అయితే నిధుల కొరత కారణంగా ఈ నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఈ నిర్మాణాలు ఇలాగే ఉండిపోవడంతో వాటి చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ప్రస్తుతం దుకాణ సముదాయ ప్రాంతం అడవిని తలపిస్తోంది. పార్కుకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం ఈ దుకాణాలను నిర్మించినప్పటికీ నిరుపయోగంగా మిగిలిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి ఈ భవనాలను వినియోగంలోకి తీసుకొస్తే కొంతమందికి ఉపాధి లభిస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

అంగన్‌వాడీ సహాయకుల నియామకానికి నోటిఫికేషన్

పార్వతీపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి డా.టి.కనకదుర్గ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట ప్రాజెక్టు పరిధిలో ఆరు, పార్వతీపురం ఒకటి, సాలూరు ఒకటి అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులు ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని తెలిపారు. ఇంటర్వ్యూ తేదీ, స్థలం వివరాలను తర్వాత తెలియజేస్తామని ఆమె చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కురుపాం, జనవరి19(ఆంధ్రజ్యోతి): కురుపాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆ శాఖ ఏఈ రాజేంద్రప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తాన్నామని ఆయన చెప్పారు.

వాలీబాల్ పోటీల విజేత దిగువ మెండంగి

సాలూరు రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సాలూరు రూరల్ పోలీసులు నిర్వహించిన మండల వాలీబాల్ పోటీల్లో దిగువమెండంగి జట్టు విజేతగా నిలిచింది. మామిడిపల్లిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 32 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం దిగువ మెండంగి, మడతనవలస జట్లు మధ్య తుది పోటీ జరిగింది. ఈ పోటీలో దిగువ మెండంగి విజేతగా నిలిచింది. సాలూరు రూరల్ ఎస్ఐ పి.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు.

క్యాబినెట్ నిర్ణయంపై హర్షం

గుమ్మలక్ష్మీపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టుపై మినీ హైడ్రల్ ప్రాజెక్టు నిర్మించి విద్యుత్ ఉత్పత్తి చేయాలన్న రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయంపై కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మినీ హైడ్రల్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఈ ప్రాంత ప్రజలకు విద్యుత్ సరఫరా జరుగుతుందని, ఉపాధి పెరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. పార్వతీపురం మన్యం జిల్లాలో తోటపల్లి మినీ హైడ్రల్ ప్రాజెక్టు నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

భామిని, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బత్తిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకున్నారు. ఆదివారం అదే పాఠశాలలో వీరంతా కలుసుకుని, ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో సందడిగా గడిపారు.



ఆత్మీయంగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆమె నేత్రాలు సజీవం



ఇందుమతి (ఫైల్)

రాజాం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన చెక్క ఇందుమతి (85) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఇందుమతి మృతి చెందడంతో కుటుంబ సభ్యుల అంగీకారం తో మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి సుజాత సహాయకులు నంది ఉమాశంకర్ ద్వారా కార్నియాలు సేకరించారు. అనంత రం విశాఖపట్నంలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. ఇందుమతి కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, సెక్రటరీ బి.మల్లేశ్వరరావు ట్రెజరర్ దుర్గా శ్రీనివాస్ అభినందించారు.